'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తూకం కిందికి సిరిసిల్ల మరమగ్గాలు!

మచ్చ ఆనంద్
98665 50819

దశాబ్దాలు గడుస్తున్నాయే గానీ నేతన్నల దశ మాత్రం మారడం లేదు. వారి బతుకు వాకిట్లోకి తొంగిచూస్తే ఎన్నో దైన్యపు చూపులు కనిపిస్తున్నాయి. చితికిన బతుకు చిత్రాలు దర్శనమిస్తున్నాయి. నేతన్నల కుటుంబాల ముఖాల్లో ఇంకిపోయిన కన్నీటి చారల విషాద ఛాయలు కనిపిస్తున్నాయి. స్థూలంగా చెప్పాలంటే కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల ముఖచిత్రం ప్రస్తుతం బోసిపోయింది. సిరిసిల్లలోనే ఎందుకిలా? అనే ప్రశ్నలు అందరి మెదళ్లను మళ్లీ తొలిచేస్తున్నాయి. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే.. ఒక్కసారి 1997-2001ల మధ్యకాలంలోకి వెళ్లాలి. అప్పుడుగాని సిరిసిల్ల నేతన్నల జీవితాలు, వారి కుటుంబాల్లో విషాద గీతికల మరణ మృదంగాలు అర్థం కావు.

సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ 60వ వసంతంలోకి అడుగు పెట్టబోతుండగా దేశ యవనికపై మరోసారి విషాద బిందువుగా సిరిసిల్ల నిలువబోతున్నది. ఇటీవల జరిగిన నేత కార్మికుల బలవన్మరణాలు ఈ విషయాన్నే తేటతెల్లం చేస్తున్నాయి. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ చరిత్ర సమస్తం ఒడుదొడుకులమయమే. సొంత పెట్టుబడులతో మూడంచెల వ్యవస్థగా నడుస్తున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆరు నెలలు మాంద్యం, ఆర్నెళ్లు గిరాకీతో నెట్టుకొస్తున్నది. అయితే గత మూడు దశాబ్దాల్లో నాలుగు అతి భారీ సంక్షోభాలను పరిశ్రమ చూడటం గమనార్హం.

ఉమ్మడి రాష్ట్రంలో మరమగ్గాలు అత్యధికంగా ఉన్న ప్రాంతం సిరిసిల్ల. ఆ తర్వాతి స్థానం చిత్తూరు జిల్లా నగరిది. మహారాష్ట్రలోని పవర్‌లూం పారిశ్రామిక కేంద్రాల ప్రభావంతో సిరిసిల్లలోనూ కుటీర పరిశ్రమగా పవర్‌లూం పరిశ్రమ ఎదిగింది. దేశవ్యాప్తంగా పవర్‌లూం పరిశ్రమ 80 శాతం వరకు అసంఘటిత రంగం ఆధ్వర్యంలోనే నడుస్తున్నది. అయితే నగరితో పోలిస్తే సిరిసిల్లలో తొలి నాళ్ల నుంచి మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడంతో వస్త్ర ఉత్పత్తిదారులు దూరప్రాంతాల్లోని దళారుల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

స్టైపల్, కాటన్, టెక్స్లో ముతక రకం వస్త్ర ఉత్పత్తులకు నిలయంగా పేరొందిన సిరిసిల్ల అద్దకం పరిశ్రమ పెట్టీకోట్‌ల భారీ విక్రయాలకు చిరునామాగా మారి ఏండ్ల తరబడి మరమగ్గాలను బతికించింది. టెక్స్లో ఉత్పత్తులు ప్రారంభమయ్యాక సిరిసిల్లలో వస్త్ర ఉత్పత్తుల్లో మౌలిక మార్పు వచ్చింది. ఈ క్రమంలో 80వ దశకంలో వస్త్ర ఉత్పత్తిదారుల్లో కొందరు దివాలా తీయడంతో బలవన్మరణాలకు పాల్పడ్డారు. అలా.. సిరిసిల్లలో విషాద మరణాల పర్వం ఆరంభమైంది. హుండీల వ్యవస్థ, వస్త్ర ఉత్పత్తుల విక్రయాలలో అవాంఛిత పోటీతత్వం కారణంగా ఆత్మహత్యలు కొనసాగుతూ వచ్చాయి. 1997 వరకు ఇదే తంతు కొనసాగింది. 2001లో ఓ నేత కార్మికుడు మరణించగా.. 1997 నుంచి 2001 వరకు 156 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. అయితే 2001లో రాజీవనగర్‌లో కొండ కిష్టయ్య కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడటంతో.. ఆ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మీడియా ద్వారా ఆ విషాద ఘటన విస్తృతంగా ప్రచారం కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి మొదటిసారిగా సిరిసిల్లపై పడింది.

నాటి కేంద్ర మంత్రి విద్యాసాగర్‌రావు చొరవ, వాజపేయి సర్కార్ తీవ్ర ఒత్తిడితో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పలు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. పవర్‌లూంలకు సగం విద్యుత్తు సబ్సిడీ, బద్దెనపల్లిలో టెక్స్‌టైల్ పార్క్, నూలు డిపో తదితర నిర్ణయాలను నాటి సర్కార్ తీసుకున్నది. విద్యుత్తు రాయితీ వల్ల ఎంతో ప్రయోజనం చేకూరింది. రెండు జతల సాంచెలున్న ఆసామి కుటుంబం.. మూడు, నాలుగేండ్లలోనే ఆరు జతల ఆసామిగా ఎదిగింది. ఆ తర్వాత 2004లో వైఎస్సార్ అధికారంలోకి రాగా.. 2006, 2008లో మళ్లీ నేతన్నల మరణ మృదంగం చోటు చేసుకోవడంతో సిరిసిల్ల ప్యాకేజీ, 2,500 ఇండ్ల స్థలాలను వైఎస్సార్ ఇచ్చారు. నేతన్నల కుటుంబాల్లోని మహిళలకు పావలా వడ్డీకే రుణాలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి.

2009-10 వరకు సిరిసిల్లలో పవర్‌లూంల సంఖ్య 21 వేలకు పెరిగింది. వలసలు దాదాపుగా నిలిచిపోయాయి. మహారాష్ట్ర, గుజరాత్‌లకు చెందిన పరిశ్రమ దృష్టి సిరిసిల్లపై పడింది. ఆ తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, 2017 నుంచి సిరిసిల్ల మరమగ్గానికి ఆర్‌వీఎం, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లతో కార్మికులకు బతుకుల్లో వెలుగులు నిండాయి. సిరిసిల్లను దేశంలోనే అగ్రపథాన నిలిపిన కేసీఆర్ సర్కార్ అందరి దృష్టిని ఆకర్షించింది. సిరిసిల్లలో పవర్‌లూంలకు ప్రభుత్వమే ఆర్డర్లు ఇవ్వాలన్న దశాబ్దాల డిమాండ్ నెరవేరింది. అంతేకాకుండా, సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ విస్తృతికి తీసుకున్న చర్యలు, అప్పారెల్‌ను అభివృద్ధి చేయడం లాంటివన్నీ సిరిసిల్ల అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయి. దేశంలో అన్ని టెక్స్‌టైల్ కేంద్రాల్లో ఉన్నట్టుగానే సిరిసిల్లలోనూ పవర్‌లూం సెక్టార్ మూడంచెల విధానంలోనే ఉన్నది. మాస్టర్ వీవర్ అంటే పెట్టుబడి పెట్టే యజమాని, ఆసామి అనే జాబ్ వర్కర్, వీవర్ అనే కార్మికుడు ఉండే ఈ వ్యవస్థలో మాస్టర్ వీవర్‌పై విమర్శలున్నాయి. మాక్స్ సొసైటీలు, ఎస్ఎస్ఐ యూనిట్లకు ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చింది. అయితే వీటన్నింటినీ మాస్టర్ వీవర్‌లే అజమాయిషీ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపేసింది. దీంతో పాత బకాయిల చెల్లింపు సమస్యగా మారింది.

బతుకమ్మ చీరల ఆర్డర్ల కారణంగా ఆ ఉత్పత్తుల తయారీకి అలవాటు పడిపోయిన మాస్టర్ వీవర్లు బయటి మార్కెట్‌పై దృష్టి సారించలేదు. ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తుందిలే అనే భీమాతో సొంత ఆలోచన, దూరదృష్టి, ఉత్పత్తుల మార్పు వైపు వారు దృష్టి సారించలేదు. మాస్టర్ వీవర్లు చేతులెత్తేయడంతో జాబ్‌వర్క్ ద్వారా వస్త్రాలు తయారు చేసే ఆసాముల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో నేడు సిరిసిల్లలో మరమగ్గాలను తూకం కింద అమ్మేయాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా 30 వేల మరమగ్గాలు ఉన్న సిరిసిల్లలో సుమారుగా 20 శాతానికి పైగా తూకం కింద అమ్మేసి నట్టు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరోవైపు కుటీర పరిశ్రమగా దశాబ్దాలుగా కొనసాగుతూ, విద్యుత్ సబ్సిడీ ద్వారా ఎంతో ప్రయోజనం పొందిన సిరిసిల్ల మరమగ్గానికి 10 హెచ్‌పీల నిబంధన గొడ్డలిపెట్టులా మారింది. ఈ నిబంధన కారణంగా పరిశ్రమ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. అంతే కాకుండా యజమానులు పాత ఉత్పత్తుల వైపు మళ్లినా.. ఆసాములు, కార్మికులు మాత్రం ఏం చేయాలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. సాంచాల పనే తెలిసిన కార్మికులు వేరే పనికి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గత దశాబ్ద కాలంలో కేసీఆర్ సర్కార్ తీసుకున్న చర్యలను, అందించిన చేయూతను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలించాలి. ముఖ్యంగా టెక్స్లో ఉత్పత్తులతో జరిగిన ప్రయోజనాన్ని, ప్రభుత్వ ఆర్డర్‌లతో మరమగ్గానికి, తద్వారా నేతన్నకు అందిన చేయూతను పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా ప్రతి పవర్‌లూంకు పని అందేవిధంగా, తద్వారా పరిశ్రమలోని మూడంచెలకు సంబంధించిన ప్రతివారు లబ్ధి పొందేలా చూడాల్సి ఉన్నది. ఇందుకోసం రాజకీయాలకతీతంగా అందరి అభిప్రాయాలను తీసుకోవాలి. సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ ఎదుగుదల కోసం ఓ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. తద్వారా ఉరిసిల్లగా మారుతున్న సిరిసిల్లను సిరులసిల్లగా మార్చాలి.

(వ్యాసకర్త: సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

విద్యుత్ సబ్సిడీ ద్వారా ఎంతో ప్రయోజనం పొందిన సిరిసిల్ల మరమగ్గానికి 10 హెచ్‌పీల నిబంధన గొడ్డలిపెట్టులా మారింది. ఈ నిబంధన కారణంగా పరిశ్రమ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. అంతేకాకుండా యజమానులు పాత ఉత్పత్తుల వైపు మళ్లినా.. ఆసాములు, కార్మికులు మాత్రం ఏం చేయాలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. సాంచాల పనే తెలిసిన కార్మికులు వేరే పనికి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రాజకీయ ప్రలోభాలకు తలొగ్గిన ఎన్టీయే

'నీట్' వ్యవహారం మరువకముందే యూజీసీ- నెట్ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వర్సిటీల్లో రీసెర్చ్ ఫెలోషిప్‌లకు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అర్హత పరీక్షగా నిర్వహించే నెట్ ఈసారి ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఆరోపణలు వచ్చిన తెల్లవారే ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్టు ఎన్టీయే ప్రకటించింది. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.6-8 లక్షల వరకు వసూలు చేసినట్టు సమాచారం. 20 రోజుల వ్యవధిలో ఎన్టీయే నిర్వహించిన రెండు జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

దేశంలోని అన్ని వర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించిన పీహెచ్‌డీ ప్రవేశాలకు నెట్ పరీక్షలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలని యూజీసీ నిర్ణయించింది. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ వర్సిటీల్లోనే ఈ నిబంధన అమలులో ఉండేది. యూజీసీ నిర్ణయం, నెట్ పేపర్ లీకేజీ వెనుక బీజేపీ ప్రభుత్వ కుట్రలు దాగి ఉన్నట్టు అనుమానాలు వస్తున్నాయి. తమ పార్టీ భావాలు గల విద్యార్థులకు వర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించి, తద్వారా తమకనుకూలంగా ఉన్న పరిశోధనలను ప్రోత్సహించడమే బీజేపీ లక్ష్యమని ఆరోపణలున్నాయి. బీజేపీ ఇప్పటికే నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసి, అశాస్త్రీయ భావాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చింది. అంతేకాదు, జీవ పరిణామ సిద్ధాంతం, పిరియాడిక్ టేబుల్, అంబేద్కర్, భగత్‌సింగ్ తదితర అంశాలను తొలగించి, అదే సమయంలో మనుస్మృతి, సావర్కర్, గోల్వాల్కర్ చరిత్రను పాఠ్యాంశాల్లో జొప్పిస్తున్నది.

నీట్, జేఈఈ (మెయిన్స్), సీ- మ్యాట్, యూజీసీ-నెట్ తదితర పరీక్షలు ఎన్టీయే ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎన్టీయేను ఆర్ఎస్ఎస్ భావాలున్న వారితో, తమకనుకూలంగా ఉండేవారితో కేంద్ర ప్రభుత్వం నింపేసింది. వారి ద్వారా తమ లక్ష్యాన్ని చేరుకోవాలని బీజేపీ ప్రభుత్వం చూస్తున్నది. నీట్, నెట్ పరీక్షల నిర్వహణలో ఎన్టీయే విఫలమైంది. ఈ నేపథ్యంలో ఎన్టీయేను రద్దు చేయాల్సిన అవసరం ఉన్నది. అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి. అంతేకాదు, ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహిస్తూ బాధిత విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. దాంతో పాటు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించి విద్యార్థులకు అండగా నిలవాలి.

- కంచనపల్లి శ్రీను

సాయిచంద్ స్వరం.. ఓ గర్జన

తెలంగాణ మలివిడత ఉద్యమంలో ఆటాపాటా తీసుకొచ్చిన చైతన్యం అంతాఇంతా కాదు. పాట లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు. అయితే ఆ ఉద్యమానికే గొంతుకగా నిలిచిందో స్వరం. తెలంగాణ పల్లెలను ఏకం చేసి ఉద్యమం వైపు మళ్లించిన 'ధూం ధాం'లో గర్జించిందీ ఆ స్వరమే. పదునైన ఆ కంఠం ఓ ఉప్పెనగా మారి పరమశివున్నే ప్రశ్నించింది. గజ్జె కట్టి ఆడిపాడి.. ఢిల్లీ పీఠాన్నే కదిలించింది. ఆ స్వరం ఎవరిదో కాదు, మలి దశ ఉద్యమంలో నాలుగున్నర కోట్ల ప్రజల్లో ఉద్యమ కాంక్షను రగిలించిన సాయిచంద్‌ది.

సంపత్ గడ్డం
78933 03516

విద్యార్థి ఉద్యమమైనా, సామాజిక చైతన్య వేదిక అయినా, మలి దశ ఉద్యమమైనా.. వేదిక ఏదైనా సరే పాటే సాయిచంద్ ఆయుధం. ఆయన పాటందుకుంటే ప్రత్యర్థుల గుండెల్లో ప్రశ్నల సునామీ పుట్టేది. 'మేం చెప్పులు కుట్టనిదే మీ కాలు బయటకెళ్లదు.. మా డప్పులు లేనిది మీ శవం కాటికెళ్లదు.. ఎవ్వడు జెప్పిండురు మేం తక్కువ జాతోల్లం అని' అంటూ సమాజంలో జరుగుతున్న దురాచారాలపై ఆయుధం ఎక్కుపెట్టిన సాయిచంద్ సామాజిక చైతన్యాన్ని రగిలించారు. అంతేకాదు, 'రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా రక్తబంధం విలువ నీకు తెలవదురా' అంటూ నాడు ఉద్యమంలో ఆయన పాడిన పాట యావత్ తెలంగాణను ఉద్యమం దిశగా నడిపించింది. నాడు ఉద్యమ రథసారథి కేసీఆర్ ఎక్కడికెళ్లినా అక్కడికి సాయిచంద్ వెళ్లేవారు. ధూం ధాంలో కాలికి గజ్జె కట్టి ఆడిపాడే సాయిచంద్ అందరిలో తన ఆటపాటతో ఉద్యమ కాంక్షను రగిలించేవారు. అతడు పాట పాడితే సబ్బండవర్గాలు లయబద్ధంగా ఆడేవి. అతడు గజ్జె కట్టి ఆడితే ముల్లోకాలు ఊగేవి. అతడి గొంతులో అంతటి మాధుర్యం ఉండేది. అతని ఆటలో ఎంతటి మహత్తు ఉందో తెలియదు కానీ, ఊరూవాడా సయ్యాటలాడేవి. ధూం ధాం, అలయ్ బలయ్.. వేదిక ఏదైనా ఉండనీ, అక్కడ సాయిచంద్ ఉండాల్సిందే.

తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తనదైన శైలిలో పాట ద్వారా ప్రజలకు చాటిచెప్పిన సాయిచంద్.. తెలంగాణ ఎందుకు రావాలో ఘంటాపథంగా వివరించేవారు. అసలు ఒక్క మాటలో చెప్పాలంటే నాటి ఉద్యమానికి పాటలతో ఊపిరులూదారు. తెలంగాణ సమాజాన్ని జాగృతపరిచారు. మహోన్నతమైన బాధ్యతను తలకెత్తుకొని గానమై గర్జించారు.

ఉమ్మడి పాలనలో ఎద నిండా వ్యథలతో కునారిల్లిన పాలమూరు గడ్డపై జన్మించిన సాయిచంద్ స్వరం తెలంగాణకే శ్వాసగా మారి ఎంతో మందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. చిన్నతనం నుంచే అభ్యుదయ భావాలను అలవరుచుకున్న ఆయన సమాజానికి గళంగా మారారు. నిత్యం చైతన్యంతో తొణికిసలాడే ఆయన పాట అనేక మందికి భరోసా ఇచ్చింది. ప్రత్యేక రాష్ట్రంతోనే తన గడ్డకు విముక్తి లభిస్తుందని సాయిచంద్ భావించారు.స్వరాష్ట్రంలో, స్వయం పాలనలోనే తమ బతుకులు బాగుపడతాయని నమ్మిన ఆయన తన గొంతును ఉద్యమానికి అరువిచ్చారు. అందుకే మలిదశ ఉద్యమంలో ఆయన గొంతు.. నాలుగున్నర కోట్ల ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించింది. సాయిచంద్ పాటలు ఎంత గొప్పగా ఉంటాయో.. ఆయన మాటలు కూడా అంతే గొప్పగా ఉంటాయి.

నేడు సాయిచంద్ వర్ధంతి

ఉద్యమంలో వివిధ కళారూపాల్లో స్వరాష్ట్ర కాంక్షను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంలో తనకు తానే సాటి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఆటాపాటా, కళారూపాల ద్వారా చాటిచెప్తూ ఉద్యమాన్ని కొత్త పంథాలో తీసుకెళ్తున్న సాయిచంద్‌ను ఉద్యమ నాయకుడు కేసీఆర్ స్వయంగా అభినందించారు. మలిదశ ఉద్యమంలో సాయిచంద్ గొంతే ఓ ఉద్యమం. కేసీఆర్ సభలైనా, ఇతర కార్యక్రమాలైనా ఆయన వేదికపై ఉంటే చాలు సభ మొత్తం ఉర్రూతలూగేది. తెలంగాణలో అలుముకున్న చీకట్లను తరిమేందుకు నిస్వార్థంగా కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన చేసిన కృషి ఎనలేనిది. తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవలేనిది.

పేద కుటుంబంలో పుట్టిన సాయిచంద్ చిన్నతనం నుంచే సమాజం హితం కోసం పాటుపడేవారు. సమాజాభివృద్ధికి తనవంతు సాయం చేయాలని పరితపించేవారు. అందుకే నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షే తన ఆకాంక్షగా మార్చుకొని ఆయన ఉద్యమ సమరంలో దూకారు. ఉద్యమ నాయకుడి అడుగుజాడల్లో నడిచారు.

దేవతలే పరవశించే మధురమైన ఆయన గొంతు మూగబోయింది. ఆ శివుడినే ప్రశ్నించినందుకో, ఏమో గానీ చిన్న వయసులోనే ఆయన మనకు దూరమైపోయారు. సాయిచంద్ భౌతికంగా మనకు దూరమైనా.. తన పాటల రూపంలో ఆయన ఎప్పటికీ మన మధ్యలోనే ఉంటారు. ఆయన పాటలకు మరణమే లేదు.

అంబేద్కర్ ఆశయాలు, మహనీయుల మార్గాన్ని అనుసరిస్తూ.. తెలంగాణ సమాజంలో జరుగుతున్న దోపిడీ, కుట్రలను నిరసిస్తూ ఎలుగెత్తి పాడిన ఆయన గళం ఓ నిప్పుకణిక. అది ఎన్నటికీ ఆరని జ్వాల. ఆయన మరణం బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ సమాజానికి తీరని లోటు. సాయిచంద్ పాటల్లోనే తన రూపాన్ని చూస్తూ.. అతని త్యాగాలను తెలంగాణ గడ్డ శాశ్వతంగా గుర్తుంచుకుంటుంది. తెలంగాణ ఉద్యమ కళాకారునికి జోహార్లు. సాయిచంద్ పాటలనే స్ఫూర్తిగా తీసుకొని అతను కలలుగన్న తెలంగాణ సమాజం కోసం పాటుపడుతున్న ఉద్యమ పార్టీకి అండగా నిలుద్దాం. అదే మనం అతనికిచ్చే అసలైన నివాళి.



ఎమర్జెన్సీ అప్రజాస్వామికమే!

ఎమర్జెన్సీని నేనూ విమర్శిస్తా. ఆ చర్య గర్వించే విషయమని చెప్పట్లేదు. ప్రతిపక్ష నాయకులను జైల్లో వేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమే. అయితే గతం గురించి ప్రస్తావిస్తున్న మోదీ సర్కార్ వర్తమానాన్ని పూర్తిగా విస్మరిస్తున్నది. ఎన్డీయే ప్రభుత్వం మొదట నీట్ పేపర్ లీక్, నిరుద్యోగ సమస్య, మణిపూర్ వివాదాలపై దృష్టిపెట్టాలి.

- శశిథరూర్, కాంగ్రెస్ ఎంపీ

ఎటమటం

ఏదైతే ఉందో...

పదేండ్లుగా ప్రతిపక్షంలో మగ్గాం. లక్కీగా ఇన్నాళ్లకు అధికారం వచ్చింది. అధికారం పోతుందనే ఆవేశంలో ఎన్నో అంటుంటాం. మాట్లాడుకుందాం... ఢిల్లీకి రండి అంటే వెళ్లా. అక్కడ వారేమో సీఎంను కలువమన్నారు. సోనియా, రాహుల్‌ను అయితే కలుస్తా... సీఎంను కలిసే ప్రసక్తే లేదన్న. కానీ రాత్రంతా ఆలోచించా... రేపటి నాడు తిరిగి ఎమ్మెల్సీ కావాలన్నా, నామినేటెడ్ పోస్టు ఇవ్వాలన్నా సీఎంతో పెట్టుకుంటే కష్టమే... మనసు మార్చుకొని సీఎం ఇంటికి బ్రేక్ ఫాస్ట్‌కు వెళ్లక తప్పలేదు. ఏదైతే ఉందో... అధికార పార్టీని ఎవరైనా వదులుకుంటారా? చెప్పండి?. మరి ఈ మాట ముందే చెప్పాలి కదా!



పవర్ 'పీఠం'

శక్తి పీఠం జోగులాంబ అమ్మవారు మనకు ఉన్నప్పటికీ అమాత్యుల భార్యలు కొందరు ఈ మధ్య అస్సోంలో శక్తి పీఠం కామాఖ్యదేవి అమ్మవారి అనుగ్రహం కోసం వెళ్లినట్టు సమాచారం. అక్కడ తాంత్రిక పూజలతో పాటు జంతుబలులు కూడా జరుగుతాయి. 'మా ఆయనకు మంత్రి పదవి కంటే ఇంకేదైనా పెద్ద పదవి ఉంటే చూడు తల్లి' అని వారు ప్రత్యేక పూజలు కూడా చేసినట్టు వినికిడి. బహుశా ఈ విషయం సీఎంకు తెలిసిందేమో... చేతబడి చేస్తుంటే చూస్తూ కూర్చుంటామా? అని ఆయన అందుకే అన్నారేమో!

పాపం నినాదం లేదు!

గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు 'బంగారు తెలంగాణ' కోసం అని చెప్పుకోవడానికి మంచి నినాదం ఉండేది. పాపం ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేవారికి నినాదమే లేకుండా పోయింది. ప్రజా పాలన కోసమని కొందరు, ప్రభుత్వ పాలన నచ్చిందని కొందరు, వ్యవసాయ విధానాలు నచ్చాయంటూ తలో మాట చెప్తున్నారు. వీరికి మంచి నినాదం ఏదైనా ఉంటే బాగుండేదని గాంధీభవన్‌లో ఓ పెద్దాయన తెగ ఆలోచిస్తున్నారు. 'పవర్ కోసం' నినాదం బాగుంది కానీ... మరి పచ్చిగా ఉంటుందేమోనని జంకుతున్నారు.

రివర్స్ గేర్

కర్ణాటకలో ముగ్గురు మంత్రులు తమకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సిద్ధరామయ్యను సీఎం సీట్లో నుంచి దింపేసి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కూర్చోబెడుతామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని ఆయన వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు విరుగుడుగా సిద్ధరామయ్య వర్గీయులు ముగ్గురికి డిప్యూటీ సీఎం పోస్టులు అడుగుతున్నారు. దీంతో సీఎం పోస్టు నాకేమీ అవసరం లేదు, నన్ను ఒక్కడినే డిప్యూటీ సీఎంగా కొనసాగిస్తే చాలు... అదే పది వేలని డీకే దారి కొచ్చినట్టు సమాచారం.

- వెల్జాల